క్లుప్తంగా

ఆయుష్మాన్ భారత్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



మునగపాకలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు,అధికారులు

మునగపాక: ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. స్థానిక నందీశ్వర తులసీ కళా వేదిక ఆవరణలో శుక్రవారం ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. ముందుగా ప్రజా ప్రతినిధులు,అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్డులున్న వారికి రూ.5లక్షల మేర బీమా రక్షణ సదుపాయం ఉంటుందన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు, మాజీ ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు కళ్లద్దాలు అందజేస్తున్న ఎంపీటీసీ వెంకటలక్ష్మి

మునగపాక: ప్రతి ఒక్కరూ 'ఫ్యామిలీ డాక్టర్' సేవలను సద్వినియోగం చేసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు కోరారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా తోటాడలో శుక్రవారం మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ అందరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇటీవల వైఎస్సార్ కంటి వెలుగు శిబిరంలో శస్త్ర చికిత్సలు నిర్వహించుకున్న వారికి కళ్లద్దాలను అందజేశారు

పదో తరగతి మోడల్ పేపర్లు విడుదల



పదో తరగతి మోడల్ పేపర్లను విడుదల చేస్తున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి

అచ్యుతాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షల మోడల్ పేపర్లను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు లక్ష్మి విడుదల చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ ఇటువంటి మోడల్ పేపర్లను రాయడం ద్వారా విద్యార్థులు తాము రాయబోయే కీలక పరీక్షలను విశ్వాసంతో రాయగలరని తెలిపారు. విద్యార్థులు పోటీతత్వం అలవరుచుకోవాలన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంఈవో-1 రామారావు

కోటవురట్ల: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకుని పట్టుదలగా చదవాలని ఎంఈవో -1 రామారావు సూచించారు. యూటీఎఫ్ నాయకుల వితరణతో కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇందులో యూటీఎఫ్ వంటి ఉపాధ్యాయ సంఘం భాగస్వామి కావడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రసాదరావు, నాయకులు లోవరాజు, ఉపాధ్యాయులు అరుణ, మురళీధర్, సువర్ణరాజు, అప్పారావు, ఏఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు



బీపీ టెస్ట్ చేయించుకుంటున్న ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు



వెంకటాపురంలో పరీక్షిస్తున్న వైద్యుడు



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో బాలాజీ



ఓపీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఖాజీపాలెంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ లాలం రాంబాబు

ఎస్.రాయవరం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గుడివాడ గ్రామంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రులకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న వారికి గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు చాలా ఉపయోగపడుతున్నాయని చెప్పారు. రాష్ట్ర బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. అనంతరం ఇరువురు ఎమ్మెల్యేలు బీపీ, మధుమేహ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో సుమారు 224 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు జనిత్‌రెడ్డి, తేజస్విని, షబ్నమ్‌లు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి,సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు నల్లపురాజు వెంకటరాజు, కొత్తరేవుపోలవరం సర్పంచ్ మల్లే లోవరాజు. మండల ప్రత్యేకాధికారి మహేష్, ఎంపీడీవో రామచంద్రమూర్తి,వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీపతిరాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు,యేజర్ల సీతారామరాజు,మణిరాజు, వర్మరాజు ,రాముురాజు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి: వెంకటాపురంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురు వైద్యులు ఈ శిబిరంలో వైద్య సేవలందించారు. ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైద్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఎస్ .కొండలరావు, దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్. వెంకటేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట సంజీవని ఆరోగ్య సురక్ష

అచ్యుతాపురం: పేదల పాలిట సంజీవనిలా ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉపయోగపడుతోందని అచ్యుతాపురం జెడ్పీటీసీ లాలం రాంబాబు అన్నారు. ఖాజీపాలెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షకు మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో 272 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో నలుగురిని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. శిబిరాన్ని జెడ్పీటీసీ లాలం రాంబాబు లాంఛనంగా ప్రారంభించి, మాట్లాడారు. సర్పంచ్ నర్సింగరావు, జగ్గన్నపేట సర్పంచ్ భర్త దొడ్డి కృష్ణ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఏవో కృష్ణ, కోన బుజ్జి తదితరులు పాల్గొన్నారు. శిబిరం నిర్వహణను ఏడీఎంహెచ్‌వో బాలాజీ పర్యవేక్షించారు. వైద్యులు కల్యాణి, ఏ.వసంత కుమార్ వైద్యసేవలందించారు.

శిబిరంలో పరీక్షలు బాగా నిర్వహిస్తున్నారు



నా వయస్సు 70 సంవత్సరాలు. ఆరు నెలలుగా కాళ్లు రావడం లేదు. కళ్లు అంటుకుపోతున్నాయి. వైద్యం కోసం దూర ప్రాంతానికి వెళ్లలేను. మా గ్రామంలో ముందు ఒక శిబిరం నిర్వహించారు. ఇది రెండో శిబిరం. పరీక్షలు బాగా చేశారు. మందులు ఇచ్చారు. డబ్బులు లేకపోయిన ఇంటి వద్దే వైద్యం అందుతోంది. ఇది చాలా మంచి కార్యక్రమం.

– దేశంశెట్టి సత్తిబాబు, ఖాజీ పాలెం.

దగ్గు,ఆయాసంతో బాధ పడుతున్నాను



నాకు వయస్సు 60 సంవత్సరాలు. దగ్గు,ఆయాసంతో బాధ పడుతున్నాను. వినబడడం లేదు, కళ్లు కొద్దిగా మసకగా మారాయి. మా ఊరిలోకి డాక్టర్లు రావడంతో వైద్య పరీక్షలు చేయించుకున్నాను. ఇటువంటి కార్యక్రమాల వల్ల మాలాంటి వృద్ధులకు దూరంగా వెళ్లే ఇబ్బంది ఉండదు. ఆటో ఖర్చులు,మందుల ఖర్చులు కూడా ఉండవు.

-అప్పికొండ పార్వతమ్మ, ఖాజీపాలెం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కొండకర్లలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్ లబ్ధిదారులు



మల్లవరంలో ఫించన్ సొమ్ము అందజేస్తున్న సర్పంచ్ పిన్నమరాజు వాసు



వెదురువాడ ఎస్సీ కాలనీలో పింఛన్ అందజేస్తున్న మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు

అచ్యుతాపురం: నూతన పింఛన్లు మంజూరు చేయడంతో పాటు, పింఛన్ నగదును రూ. 3వేలకు పెంచడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ మేరకు అచ్యుతాపురం మండలంలోని కొండకర్లలో పింఛన్ లబ్ధిదారులు శుక్రవారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మల్లవరం గ్రామంలో సర్పంచ్ పిన్నమరాజు వాసు చేతుల మీదుగా పింఛన్ సొమ్మును అందజేశారు. బత్తిన రమణ, చోడపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు. వెదురువాడ ఎస్సీ కాలనీలో మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంగూలి శ్రీను, బుద్ధరాజు రాజేష్ వర్మ, మైలపల్లి అమ్మాజీ, ఎం.రాహుల్, రంగాల రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ల మంజూరు



సిరసపల్లిలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి



పాములవాకలో పింఛన్లు అందజేస్తున్న శ్రీనివాసరావు

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తుందని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని టి.సిరసపల్లి సచివాలయ ప్రాంగణంలో శుక్రవారం ఆమె పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి మోహిని తదితరులు పాల్గొన్నారు.

పాములపాకలో..

కోటవురట్ల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛను నగదును పెంచి ఆదుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు అన్నారు. పాములవాకలో కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పింఛను నగదు రూ.3 వేలు అందివ్వడం దేశంలోనే ప్రథమం అన్నారు. లబ్ధిదారులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పిన్నంరాజు నారాయణమ్మ మృతికి సంతాపం



రాంబిల్లి: యలమంచిలి సమితి మాజీ అధ్యక్షులు పిన్నంరాజు సత్యనారాయణరాజు(సత్యంరాజు) భార్య నారాయణమ్మ శుక్రవారం మృతి చెందారు. నారాయణమ్మ యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజుకు సోదరి. ఈమె శుక్రవారం రాంబిల్లిలో మృతి చెందారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నారాయణమ్మ మృతి పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులతో మహేష్

ఎస్.రాయవరం: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని మండల ప్రత్యేకాధికారి మహేష్ అన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గుడివాడలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీడీవో రామచంద్రమూర్తి, పంచాయతీ కార్యదర్శి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు



నాగులాపల్లిలో కలశాలతో అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు



దిమిలిలో అక్షింతలు అందజేస్తున్న బాలాజీ

మునగపాక: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను నాగులాపల్లిలో శుక్రవారం ఘనంగా ఊరేగించారు. మహిళలు కలశాలతో అన్ని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

రాంబిల్లి: అయోధ్య రాముడు అక్షింతల పంపిణీ కార్యక్రమం దిమిలిలో ముమ్మరంగా జరుగుతోంది. రామ భక్తులు కన్నం బాలాజీతో పాటు పలువురు ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేస్తున్నారు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభం, రాముడు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంటి వద్ద ఐదు దీపాలు వెలిగించాలని బాలాజీ తదితరులు సూచించారు.

కనక మహాలక్ష్మికి లక్ష పుష్పార్చన



సామూహికంగా పూజలు చేస్తున్న మహిళలు

యలమంచిలి రూరల్: ధర్మవరం కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారి మూల విరాట్‌కు లక్ష పుష్పార్చన చేశారు. పలువురు మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు కోటి పంతులు ఆధ్వర్యంలో అష్టోత్తర, సహస్ర నామార్చనలు, చేసి అమ్మవారికి హారతులిచ్చారు.

కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్‌సీపీలో గుర్తింపు



బొడ్డేడ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కోశాధికారి బుజ్జి

మునగపాక: కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్‌సీపీలో తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. పదవులు పొందిన వారంతా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కోశాధికారిగా నియమితులైన రాయి నాగేశ్వరరావు(బుజ్జి) మర్యాదపూర్వకంగా శుక్రవారం ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించి, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అయ్యేలా అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యాదగిరి గణేష్, యలమంచిలి సన్యాసినాయుడు,పక్కుర్తి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాలజోగులు



ధాన్యం కొనుగోలు ప్రారంభం కార్యక్రమంలో శ్రీనివాసరావు, రైతులు

ఎస్.రాయవరం: రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గుడివాడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఇటీవల తుపాను ప్రభావంతో పాడైయిపోయిన ధాన్యాన్ని సహితం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు అన్నారు. పాములవాక ఆర్బీకేలో ధాన్యం కొనుగోలును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మిచాంగ్‌తో వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మండలంలో సుమారు 1100 హెక్టార్లలో పంట నష్టపోయినట్టు అధికారులు గుర్తించారని, ప్రతి రైతుకు నష్టపరిహారం అందుతుందని చెప్పారు. పాడైన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న సూర్యనారాయణరాజు, సీతారామరాజు

కోటవురట్ల: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని గారా ఆనంద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ పండగ వాతారణంలో ఆటల పోటీలు సంతోషాన్ని నింపుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్రాంతి పండగ సందర్భంగా క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. పది రోజుల పాటు టోర్నీ జరుగుతుందని, విజేతలకు సంక్రాంతి రోజున బహుమతి ప్రధానం చేస్తామని టోర్నీ నిర్వాహకుడు ఆనంద్ తెలిపారు.

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి



లాలంకోడూరు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

రాంబిల్లి: పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు మంచి మార్కులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు సూచించారు. లాలంకోడూరు ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించి, పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 6వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఎంఈవో వంటాకు సూర్యనారాయణ, హెచ్‌ఎం పద్మావతి పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహం ఆవిష్కరణ



సరస్వతీదేవి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, నాయకులు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని శుక్రవారం ప్రారంభించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ప్రారంభించారు. 2001-02లో ఇక్కడ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల వితరణతో ఐరన్ గ్రిల్స్‌తో మండపం నిర్మించి, అందులో చదువులతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం, నృత్యాలు, మ్యాజిక్ షో ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు నరేష్, రామరాజు, ఆచారి, విజయ్, నాగేష్, రాజు, శివ, మాజీ సర్పంచ్ దాసరి నారాయణరావు, చినబొడ్డేపల్లి సర్పంచ్ శివరాం పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి

మునగపాక: మండల వ్యాప్తంగా శుక్రవారం క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిమ్మరాజుపేట సచివాలయ పరిధిలో నిర్వహించిన క్రికెట్ పోటీలను సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులున్నారని వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్,పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు తోటాడలో ఉచిత వైద్య శిబిరం

మునగపాక: తోటాడ డెయిరీ ఫారం వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనున్న శిబిరంలో న్యూరాలజిస్టు సాయిసందీప్ సేవలందిస్తారన్నారు.

శీరంను పరామర్శించిన వైవీ సుబ్బారెడ్డి




హెల్త్‌సిటీ ఎంబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నక్కపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు శీరం నర్సింహంమూర్తిని పరామర్శిసున్న వై.వి సుబ్బారెడ్డి

నక్కపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడి ఆరిలోవ హెల్త్ సిటీ ఎంబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తిని ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లి నర్సింహమూర్తి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అతని కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని సుబ్బారెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, పాయకరావుపేట మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు,సూరకాసుల గోవింద్ పాల్గొన్నారు.

నేడు 'ఆడుదాం ఆంధ్రా' పోటీలపై సమావేశం

మునగపాక: మండల స్థాయిలో ఈ నెల 10 నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా పోటీలకు సంబంధించి స్థానిక మండల పరిషత్ హాలులో శనివారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులతో సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఓ ప్రకటనలో తెలిపారు. అందరి సలహాలు,సూచనల మేరకు పోటీలు ఎలా నిర్వహించాలనే విషయమై చర్చిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

దాబాలు,రెస్టారెంట్‌లలో సీసీ కెమెరాలు తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ బుచ్చిరాజు

అచ్యుతాపురం: దాబాలు, రెస్టారెంట్‌లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, లిక్కర్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో దాబా,రెస్టారెంట్‌ల యజమానులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాబాలు,రెస్టారెంట్‌లకు వచ్చేవారికి తగిన పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు.